## క్లుప్తంగా

### చదువుతూనే సంపాదిద్దాం

జడ్చర్ల టౌన్: చదువుతూనే సంపాదించి తల్లిదండ్రులకు అండగా నిలబడదామని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.అప్పియా చిన్నమ్మ విద్యార్థులకు సూచించారు. కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యూటీషియన్ సర్టిఫికెట్ కోర్సు మంగళవారంతో ముగిసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. సర్టిఫికెట్లను అందజేశారు. మొత్తం 60మంది కోర్సును పూర్తిచేసినట్లు వివరించారు. విభాగం కన్వీనర్ సుభాషిణి, సభ్యులు పాల్గొన్నారు.

### ‘ఎన్టీఆర్’లో మత్స్యదినోత్సవం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జువాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ మత్స్యదినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ చేపల్లో పుష్కలంగా పోషకవిలువలు ఉంటాయన్నారు. హృదయ సంబంధ వ్యాధులు తగ్గుతాయన్నారు. చేపల పెంపకంతో ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని తెలిపారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అధ్యాపకులు శివప్రసాద్, వెంకటరమణమూర్తి, నసీంభాను, శ్రీలత, ఆసియాబేగం, వర్ధిని తదితరులు పాల్గొన్నారు.

### ముదిరాజ్‌లంతా ఏకం కావాలి

దేవరకద్ర: ముదిరాజ్‌లంతా ఏకం కావాలని మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ కోరారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలో దేవరకద్ర, కొత్తకోట, చిన్నచింతకుంట, భూత్పూర్ మండలాలకు సంబంధించిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రదీప్‌కుమార్‌గౌడ్, కరణంరాజు, వెంకటేష్, సత్యనారాయణ, జట్టి నర్సింహారెడ్డి, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

### గుర్రాన్ని ఢీకొట్టిన లారీ

అడ్డాకుల: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం లారీ ఢీకొట్టడంతో గుర్రం తీవ్రంగా గాయపడింది. వివరాల్లోకి వెళ్తే.. కొన్నాళ్ల నుంచి ఓ గుర్రం అడ్డాకుల పరిసరాల్లో సంచరిస్తోంది. ఈక్రమంలో కర్నూల్ వైపు వెళ్లే రోడ్డును దాటుతున్న గుర్రాన్ని లారీ ఢీకొట్టడంతో అది తీవ్రంగా గాయపడింది. మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్‌ఖన్నకు సమాచారం ఇవ్వడంతో ఆయన వైద్య సిబ్బందిని పంపించారు. దానికి చికిత్స చేయించి యంత్రాల సాయంతో రోడ్డు నుంచి కొంత దూరం తీసుకెళ్లి చెట్టు కింద వదిలేశారు.

### ‘భగీరథ’ పైపులైన్ లీకేజీ

రెండు నెలలుగా వృథా అవుతున్న నీరు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 46వ వార్డు పరిధిలోని గంజి నాగయ్య కాలనీ వీధి నం.1 వద్ద రెండు నెలల నుంచి మిషన్ భగీరథ పథకం పైపులైన్ లీకేజీ అయి తాగునీరు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పథకం ద్వారా తాగునీరు వదిలినప్పుడు న్యూగంజ్–పోచమ్మ గుడి సమీపం (ఫ్లైఓవర్ బ్రిడ్జి చివరన) లోని సీసీరోడ్డు మధ్యలో నుంచి ఏరులై పారుతోందని వాపోతున్నారు. వెంటనే ఈ లీకేజీని సరిచేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై ఏఈ పృథ్వీని వివరణ కోరగా త్వరలోనే అక్కడికి సిబ్బందిని పంపించి దానిని బాగు చేయిస్తామన్నారు.

### కొనసాగుతున్న ప్రచారాలు

- పరిగి కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి తరఫున మహమ్మదాబాద్ మండల పరిధిలో నాయకులు ప్రచారం చేశారు. పలువురు ఈ సందర్భంగా పార్టీలో చేరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కమతం రాజేందర్ రెడ్డి, వెంకటయ్య, రెడ్డిపల్లి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.
- హన్వాడ మండలకేంద్రంలో మంగళవారం ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ అభ్యర్థి మున్నూర్ రవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. పలువురు మహిళలు, నాయకులు ఆయనకు స్వాగతం పలికారు.
- కోయిల్‌కొండ మండలంలోని వీరంపల్లి నాయకుడు చెన్నారెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు సురేందర్‌గౌడ్ తదితరులు నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సర్పంచ్ హనుమంతు, నాయకులు పాల్గొన్నారు.
- అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లి 13వ వార్డులో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వస్తే గ్యారెంటీ పథకాలను అమలుచేస్తామని తెలిపారు.
- మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి మంగళవారం చిన్నచింతకుంట మండలంలోని ఉంద్యాల, అల్లిపూరం గ్రామాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలనుంచి వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

# ఆలోచించి ఓటు వేయండి



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను తమ భుజాలపై ఎత్తుకున్న కార్యకర్తలు

మహబూబ్‌నగర్ రూరల్ /మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఎన్నో ఏళ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ఈ ప్రాంతాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి రాకముందు.. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందో ఒకసారి ఆలోచించాలని అన్నారు. మంగళవారం అల్లీపూర్, ధర్మాపూర్, చౌదర్‌పల్లి గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో మంత్రి ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనలో 24 గంటల కరెంట్ ఎందుకు ఇవ్వలేదని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వారు అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు రైతుబంధు సాయం ఇవ్వొద్దని, మిగతా సంక్షేమ పథకాలు ఆపేయాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని ఆరోపించారు. అయితే ఎన్నికల తర్వాత అన్ని పథకాలు తిరిగి కొనసాగుతాయని భరోసానిచ్చారు. సీఎం కేసీఆర్‌ను గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని సూచించారు. బీజేపీకి ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మళ్లీ కొత్త రూపంతో ప్రజలను మోసం చేసేందుకు వచ్చారని తరిమి కొట్టాలని సూచించారు. లక్ష మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. చౌదర్‌పల్లిలో ప్రచారానికి వెళ్లిన మంత్రి అక్కడ నూతన నవ వధూవరులు మనీషా, గోపాల్‌లను ఆశీర్వదించారు. ఓటువేయాలని కోరారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే పేదలకు మేలు జరిగిందని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మంగళవారం కోడూర్ తండాలో ప్రచారం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ కె.అనిత, సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, ముడా డైరెక్టర్ ఆంజనేయులు, డీసీసీబీ డైరెక్టర్ పి.నర్సిములు, మన్యంకొండ పాలక మండలి సభ్యుడు చిన్నయ్యగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్, మాజీ సర్పంచ్ హన్మానాయక్ పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.



అల్లీపూర్‌లో నాగలితో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

### పనిచేసేవారికే మద్దతు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. పనిచేసేవారికే తమ మద్దతు ఉంటుందన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గిరిజన, యాదవ, బ్రాహ్మణ, సగర, రిటైర్డ్ గజిటెడ్ ఉద్యోగ సంఘాల నాయకులు మీడియా సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా సంఘాల నాయకులు డి.లక్ష్మణ్‌నాయక్, ప్రతాప్‌నాయక్, మోతీలాల్, , రమేశ్‌నాయక్, చందర్‌నాయక్, సత్యం యాదవ్, శాంతన్న యాదవ్, గోపాల్‌యాదవ్, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్ తదితరులు ఉన్నారు.

మహబూబ్ నగర్ బీఆర్‌ఎస్ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డు, ఎదిరకు చెందిన 100 మంది మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు.

తెలుగు గూడెంకు చెందిన బీజేపీ మండల కోశాధికారి టీ. ఆంజనేయులు ఇతర నాయకులు, జిల్లా కేంద్రంలోని స్ట్రీట్ వెండర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు న్యూటౌన్‌లోని పార్టీ కార్యాలయంలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.



ధర్మాపూర్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రచార రోడ్‌షోకు హాజరైన జనం



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు మద్దతు ప్రకటిస్తున్న సగర సంఘం నాయకులు

# డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/పాలమూరు: పాలమూరు అభివృద్ధి డబుల్ ఇంజిన్ సర్కారుతోనే సాధ్యమని బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి అన్నారు. మంగళ వారం స్థానిక పాల్కొండతండా, పంచముఖికాలనీ, మర్లు, శ్రీరామ కాలనీ, క్రిస్టియన్‌పల్లి, పాల్కొండ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలన అంతా అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. తనను గెలిపిస్తే నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇక మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి రాంమందిర్‌చౌరస్తా నుంచి పాన్‌చౌరస్తా వరకు, కొత్తగంజ్‌లో అభ్యర్థి సతీమణి రిషికారెడ్డి సైతం ప్రచారం చేశారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, పార్టీ నాయకులు పద్మజారెడ్డి, పాండురంగారెడ్డి, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ నియోజకవర్గ అభ్యర్థిగా పార్టీ తనకు సీటు కేటాయించిందని, పాలమూరును అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వాలని అభ్యర్థి మిథున్‌రెడ్డి కోరారు. జిల్లా బార్ అసోసియేషన్ భవన్‌లో మంగళవారం బార్ కౌన్సిల్ సభ్యులతో పాటు ఇతర న్యాయవాదులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. న్యాయవాదులు బీజేపీకి మద్దతు ఇచ్చి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం మిథున్‌రెడ్డిని న్యాయవాదులు సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు అనంతరెడ్డి, సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.



బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు



జిల్లా కేంద్రంలో ప్రచారం చేస్తున్న ఏపీ జితేందర్‌రెడ్డి తదితరులు

# అభివృద్ధి చేసేవారికి ఓటు వేయండి





మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిడ్జిల్: ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన అభివృద్ధి, గత ప్రభుత్వాల పనితీరును చూసి సరైన వారికి ఓటువేయాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం చిల్వేర్, అయ్యవారిపల్లి, వెలుగొమ్ముల, కొత్తూర్, మల్లాపూర్, రాణిపేట్, కొత్తపల్లి, బోయిన్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ మాయమాటలకు ప్రజలు మోసపోవద్దని సూచించారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని వివరించారు. ఆయన వెంట ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ శశిరేఖ, పాండుయాదవ్, నర్సింహారెడ్డి, జంగారెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ వస్తే కష్టాలే



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: పుట్టిన బిడ్డ తల్లి దగ్గర ఉండడం ఎంత సురక్షితమో...తెచ్చుకున్న తెలంగాణ సీఎం కేసీఆర్ చేతిలో ఉండటం కూడా అంతే సురక్షితమని.. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల, తిమ్మాయిపల్లి తండా, తిమ్మాయిపల్లి, గుడిబండ, శాఖాపూర్‌లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే కష్టాలు తప్పవన్నారు. రాష్ట్రం బాగుపడుతుంటే కళ్లు మండుతున్నాయని విమర్శించారు. వివిధ పార్టీల వారు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాధిక, ప్రదీప్‌కుమార్‌గౌడ్, బాలమణెమ్మ, తిమ్మప్ప తదితరులు ఉన్నారు.

చిన్నచింతకుంట: బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

### మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ



మహబూబ్‌నగర్ క్రీడలు: ఆత్మరక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని మహాత్మాగాంధీ రోడ్డు ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం జగదీశ్వరాచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ రోడ్డు ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో ప్రత్యేక కరాటే శిక్షణ అందజేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం శిక్షణ కార్యక్రమంలో జీహెచ్‌ఎం పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు వేణుగోపాల్, ఎస్ఎస్.ఖాద్రీ, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కసారి అవకాశం ఇవ్వండి



ఓటు అభ్యర్థిస్తున్న అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్: నియోజక వర్గ ప్రజలకు సేవచేసేందుకు ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి కోరారు. మంగళవారం మున్ననూర్, వాడ్యాల్, వేముల, మసిగోండ్లపల్లి, ఈదుల బావితండా, సింగందొడ్డి, దోనూర్, వస్పుల, వల్లభ్‌రావుపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మారెడ్డి ప్రజల సమస్యలు పట్టించు కోలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆయన వెంట నాయకులు రబ్బాని, అల్వాల్‌రెడ్డి, గౌస్, సాయిలు, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనునాయక్, శంకర్, జహంగీర్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

నారాయణపేట/కోయిల్‌కొండ: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రతి గడప గడపకు కేసీఆర్ పథకం అందుతుందని.. ప్రజలంతా మళ్లీ బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారని.. రాబోయేది మళ్లీ కారు సర్కారేనంటూ బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం నారాయణపేట నియోజకవర్గంలోని దామరగిద్ద మండలం అన్నసాగర్, మొగల్‌మడ్కా, నారాయణపేట మండలంలో పలు గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గత ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని.. ఈ ప్రాంతా అభివృద్ధిని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దామరగిద్ద మండలంలోని కానుకుర్తిలో రిజార్వాయర్‌ను ఏర్పాటుచేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. మొగల్‌మడ్కాలో మినీబ్యాంకు ఏర్పాటుచేయాలని ప్రజలు ఇదివరకే తన దృష్టికి తీసుకొచ్చారని జనవరిలోపు సంబంధిత బ్యాంక్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని భరోసానిచ్చారు. దామరగిద్ద మండలంలో మరో మండలాన్ని ఏర్పాటుచేయించి ప్రజలకు మరింత పాలనను సౌలభ్యం చేసేందుకు కృషిచేస్తామన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా వాటిని ప్రజలు తిరస్కరించాలన్నారు. తనను మరోసారి గెలిపించి అసెంబ్లీకి పంపాలని ఓటర్లను అభ్యర్థించారు.

### కాంగ్రెస్ టూరిస్టులను తరిమికొడదాం

కాంగ్రెస్ పార్టీ తెలంగాణను అభివృద్ధి చేస్తామనడం అంటే మబ్బులను చూసి కడుగుల నీళ్లు పోసుకోవడమేనని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రజలు డిసైడ్ అయ్యారని ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో తన కుమార్తె నందినిరెడ్డితో పాటు స్వాతిరెడ్డి, కార్యకర్తలతో కలసి ప్రచారం చేపట్టారు. మా నాన్న చేసిన అభివృద్ధికి నారాయణపేట నిదర్శనమని ఎస్ఆర్‌రెడ్డి కుమార్తె నందిని రెడ్డి పేర్కొన్నారు.



ఎస్ఆర్‌రెడ్డిని గెలిపించాలని పేటలో ఓటర్లను కోరుతున్న ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి

### బీఆర్‌ఎస్‌లో చేరికలు

నారాయణపేట మండలంలోని ఎక్లాస్‌పూర్‌కు చెందిన బీజేపీ మాజీ జెడ్పీటీసీ అరుణ, మాజీ ఎంపీటీసీ అశోక్ వారి అనుచరులతో మంగళవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. చిన్నజట్రం గ్రామానికి చెందిన 30 మంది, జాజాపూర్, బొమ్మన్‌పాడు ఇతర పార్టీల కార్యకర్తలు, దామరగిద్దకు చెందిన 50 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు.

కోయిల్‌కొండ మండలంలోని ఎల్లారెడ్డిపల్లికి చెందిన హనిమ్‌రెడ్డి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన వెంట వింజామూర్ సర్పంచ్ నారాయణరెడ్డి, వశ్యనాయక్ తదితరులు ఉన్నారు.

### ‘ఎంవీఎస్’లో ఓటుహక్కుపై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఓటుహక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాగేంద్రస్వామి హాజరై ప్రసంగించారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. వివిధ అంశాలపై ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, బాలయ్య, రమేష్‌చందు, ఎన్ఎస్ఎస్ వలంటీర్స్, అధ్యాపకులు రాఘవేందర్ రెడ్డి, నిరంజన్‌గౌడ్, కథర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి హోం ఓటింగ్

- జడ్చర్ల నియోజకవర్గంలో 104మంది ఓటర్లు

జడ్చర్ల టౌన్: ఈనెల 30న జరగనున్న సాధారణ ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు హోం ఓటింగ్ జరగనుంది. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని వారికి ఎన్నికల కమిషన్ హోం ఓటింగ్‌కు అవకాశం కల్పించింది. దీంతో 80ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటివద్దే ఓటు వేసే వెసులుబాటు పొందారు. జడ్చర్ల అసెంబ్లీలో మొత్తం 104 మంది ఓటర్లకు హోమ్ ఓటింగ్ అవకాశాన్ని ఎన్నికల అధికారులు కల్పించారు. ఇందుకోసం రెండు రూట్లు ఏర్పాటు చేసి మూడు బృందాలు నియమించినట్లు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ శ్రీనివాసులు తెలియజేశారు. మొదటి రోజు మిడ్జిల్, రాజాపూర్ మండలాల్లో, రెండో రోజు జడ్చర్ల, నవాబుపేట, మూడవరోజు ఊర్కొండ, బాలానగర్ మండలాల్లో ఓటింగ్ స్వీకరిస్తామన్నారు. ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వివరించారు.

### ఎన్నికల పక్రియపై అవగాహన అవసరం



ఓటు వినియోగానికి క్యూలైన్లో నిల్చున్న విద్యార్థులు



ఎన్నికలు నిర్వహిస్తున్న విద్యార్థులు

చిన్నచింతకుంట: అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్నికల పక్రియపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌ల పనితీరుపై వివరించారు. ప్రక్రియపై అవగాహన అవసరమన్నారు. విద్యార్థులతో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. వందశాతం ఓటు హక్కును వినియోగించుకోవాలని వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఉపాధ్యాయులు చక్రవర్తి గౌడ్, రవిశంకర్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.